RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -231 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 22 జూన్ 2025



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

## మరో ముగ్గురు ఇరాన్ టాప్ కమాండ్‌ర్ల హతం

టెహ్రాన్,:ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలు, అణు శాస్త్రవేత్తలను కోల్పోయిన ఇరాన్ తాజాగా మరో ముగ్గురు టాప్ కమాండర్లను కోల్పోయింది. దీంతో ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు గట్టి దెబ్బ తగిలింది. ఈ దాడుల్లో మృతి చెందిన కమాండర్లలో ఇరాన్ ఖుద్స్ ఫోర్స్ ఆయుధ సరఫరా విభాగం కమాండర్ బెహ్నామ్ షాహ్‌రియారీ కూడా ఉన్నట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. ఇజ్రాయెల్ సరిహద్దు నుంచి 1,000 కిలోమీటర్ల దూరంలోని పశ్చిమ ఇరాన్‌లో బెహ్నామ్ షాహ్‌రియారీ నడుపుతున్న వాహనంపై బాంబు దాడి జరపడంతో అతను హతమైనట్టు ఐడీఎఫ్ ధ్రువీకరించింది. ప్రాక్సీలకు ఇరాన్ ఆయుధాల స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించడంలో ఇతను కీలకవ్యక్తిగా ఉన్నట్టు తెలిపింది. లెబనాన్‌లో హెజ్‌బుల్లా, గాజాలో హమాస్, యెమెన్‌లో హౌతీ మిలీటియాకు నేరుగా ఆయుధాల సరఫరాలో ఇతని ప్రమేయం ఉంది. ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణల్లో ఇజ్రాయెల్ పౌరులు, సైనిక బలగాలపై ప్రయోగించిన రాకెట్లు, క్షిపణులను సరఫరా చేయడంలో సాహ్‌రియారీ పాత్ర కీలకమని ఐడీఎఫ్ తెలిపింది. కాగా, ఇజ్రాయెల్ శనివారం ఉదయం జరిపిన మరో దాడిలో ఖుద్స్ ఫోర్స్ పాలస్తీనా డివిజన్ హెచ్ సయీద్ ఇజాదీ మరణించాడు. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న మమాస్ మారణహోమానికి పాల్పడడానికి ముందు ఈ ఘటనకు ఎ÷-లానింగ్, వనరుల సరఫరా వంటివి ఇజాదీ చేసినట్టు ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. శనివారంనాడే ఇరాన్‌కు చెందిన మరో కమాండర్ అమిన్ పౌర్ జోడకీ కూడా హతమైనట్టు పేర్కొంది. ఐఆర్‌జీసీ సెకెండ్ డ్రోన్ యూనిట్‌కు ఇతను డిప్యూటీ కమాండర్‌గా ఉన్నట్టు తెలిపింది. ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఈ దాడులు చేపడుతోంది.

-------------

# మరోమారు ప్రణీత్ రావు విచారణ

హైదరాబాద్,: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు మరోసారి విచారించారు. 5 గంటల పాటు ప్రణీత్ రావును సుదీర్ఘంగా ప్రశ్నించారు. ఉదయం 11గంటలకు హాజరయిన ప్రణీత్ రావు...విచారణ ముగిసిన తర్వాత సాయంత్రం 4గంటలకు తిరిగి వెళ్లిపోయారు. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ చేశారు, అప్పటి పోలీసు ఉన్నతాధికారుల ప్రమేయం ఈ వ్యవహారంలో ఏ మేరకు ఉందనే కోణాల్లో విచారణ కొనసాగినట్లు సమాచారం.

-------

# కడప కమిషనర్‌కు మేయర్ షోకాజ్ నోటీసు

కడప,:కడప మున్సిపల్ కమిషనర్ సహా ఏడుగురు ఉద్యోగులకు మేయర్ సురేశ్ బాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధులు సరిగా నిర్వహించలేదని, వారంలో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. శుక్రవారం మేయర్ అధ్యక్షతన కడప కార్పొరేషన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఈ ఏడుగురు ఉద్యోగులు హాజరుకాలేదు. దీంతో మేయర్ సురేశ్ బాబు వారికి షోకాజ్ నోటీసులు పంపారు. సమావేశానికి ఎందుకు రాలేదో సరైనా వివరణ ఇవ్వాలని తెలిపారు.

# యోగా డేను సక్సెస్ కావడం ఆనందదాయకం

## కలెక్టర్ కృషిని అభినందించిన సిఎం చంద్రబాబు

అమరావతి,: విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. యోగా డేను ఘనంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారని అభినందించారు. యోగా డే నిర్వహణలో కలెక్టర్ కృషి, ప్రణాళిక అమలుకు సీఎం కితాబిచ్చారు. కార్యక్రమం విజయవంతం కావడంలో అధికారులు కీలక పాత్ర పోషించారని, కూటమి నేతలు సమన్వయంతో పనిచేశారని కొనియాడారు. ఇవాళ విశాఖలో నిర్వహించిన యోగాంధ్ర వేడుకలో 3,02,087 మంది పాల్గొన్నారని ప్రభుత్వం నిర్ధారించింది. ఒకేసారి రెండు గిన్నీస్ రికార్డులు సృష్టించటం ఇదే ప్రథమమని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజా చైతన్యంతోనే ఈ విజయం సాధించామని హర్షం వ్యక్తంచేశారు. ప్రకృతి కూడా కరుణించిందన్నారు. 20రోజుల క్రితం వర్షం పడుతుందనే సమాచారంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని వివరించారు. ఇంత పెద్ద వేడుకను చిన్న ఇబ్బంది కూడా లేకుండా సాంకేతికత సాయంతో విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖ సాగర తీరంలో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా సందర్భంగా వైజాగ్ సాగర తీరంలో ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 'యోగాంధ్ర' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రసగించారు. యోగా విశిష్టతపై మాట్లాడారు. యోగాను ప్రపంచానికి పరిచయం చేసిందే ప్రధాన మంత్రి మోదీ అని.. ఆయన కృషి వల్లే ఈ రోజు 130 దేశాలు యోగా డే నిర్వహిస్తున్నాయని అన్నారు. హిస్టరీ రాయాలన్న..ఏ రికార్డు బ్రేక్ చేయాలన్న మోదీకే సాధ్యమంటూ ప్రధానిపై ప్రశంసల జల్లు కురిపించారు.

# ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంపై కేంద్ర ప్రభుత్వ మౌనం దౌత్య వైఫల్యమని సోనియా విమర్శ

**జూన్ 21, ఆంధ్ర ప్రగతి:**



ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణంపై భారత ప్రభుత్వం అనుసరిస్తున్న మౌన వైఖరిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ విమర్శించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దౌత్యపరమైన వైఫల్యంగా కనిపిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది భారత దేశం యొక్క నైతిక, వ్యూహాత్మక సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. టెహ్రాన్‌పై టెల్ అవీవ్ చేస్తున్న దాడులను సోనియా గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇవి చట్టవిరుద్ధమైన చర్యలని, సార్వభౌమాధికారంపై జరిగిన దాడిగా ఆమె అభివర్ణించారు. ఇజ్రాయెల్ చర్యల వల్ల ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా ఘర్షణలు అస్థిరతను మరింత పెంచి, కొత్త వివాదాలకు దారితీస్తాయని ఆమె హెచ్చరించారు. ఇరాన్, అమెరికా దేశాల మధ్య అణు ఒప్పందంపై చర్చలు జరుగుతున్న సమయంలో టెల్ అవీవ్, టెహ్రాన్‌లోని అణు కేంద్రాలపై దాడులు చేయడం సమర్థనీయం కాదని సోనియా గాంధీ అన్నారు. గాజాలో ఇజ్రాయెల్ సృష్టిస్తున్న మారణహోమంలో 55,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గాజా ప్రాంతం కరవు కోరల్లో చిక్కుకుని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గాజాలో జరిగిన విధ్వంసం వంటి పరిస్థితులు ఇరాన్‌లో పునరావృతం కాకుండా చూడాలని, భారత ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. భారతదేశానికి ఇరాన్, ఇజ్రాయెల్‌తో సుదీర్ఘకాలంగా దౌత్య సంబంధాలు ఉన్నాయని సోనియా గాంధీ గుర్తు చేశారు. ఇటీవలి న్యూఢిల్లీ, టెల్ అవీవ్ మధ్య రక్షణ, వాణిజ్యం, నిఘా రంగాల్లో సహకారం పెరిగినప్పటికీ, టెహ్రాన్‌తో భారత్‌కు చారిత్రక, నాగరిక, వ్యూహాత్మక బంధాలు కొనసాగుతున్నాయని ఆమె స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, యుద్ధ వాతావరణాన్ని నివారించడానికి భారత ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో ఇరాన్ దౌత్యవేత్త మొహమ్మద్ జావాద్ హొస్సేనీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇజ్రాయెల్ దురాక్రమణను భారత్‌తో సహా ప్రపంచ దేశాలు ఖండించాలని ఆయన కోరారు. ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ తమ దేశంలోని కీలక ప్రాంతాలను ధ్వంసం చేస్తోందని హొస్సేనీ ఆరోపించారు.

# యోగాంధ్రతో రికార్డు సృష్టించిన విశాఖ

## చంద్రబాబు, లోకేశ్ కృషి మరువలేనిది -రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్

**అమరావతి, జూన్ 21, ఆంధ్ర ప్రగతి:**



యోగాంధ్రను విజయవంతం చేసిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏపీ రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. విశాఖ వేదికగా యోగాంధ్ర అరుదైన రికార్డును సొంతం చేసుకుందని హర్షం వ్యక్తంచేశారు. ప్రపంచం మొత్తం ఒక్కసారిగా ఏపీ వైపు చూసిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎనలేని కృషి చేశారని కొనియడారు. ఒక్క విశాఖలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 2 కోట్ల మంది పైగా ప్రజలు యోగాసనాల్లో పాల్గొని చరిత్ర సృష్టించారని తెలిపారు. విశాఖ వేదికగా శనివారం నిర్వహించిన యోగాంధ్ర అరుదైన రికార్డ్‌ని సొంతం చేసుకుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. యోగాంధ్రను విజయవంతం చేసిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఒక్క విశాఖలోనే కాక ఏపీవ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మందికి పైగా ప్రజలు యోగాసానాల్లో పాల్గొని చరిత్ర సృష్టించారని అన్నారు. ప్రజలు, కూటమి నేతలు, అధికారులు సమన్వయంతో యోగాంధ్రని విజయవంతం చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో శనివారం తెల్లవారుజామునే యోగాలో పాల్గొనేందుకు ప్రజలు తరలివచ్చారని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ముఖ్యమంత్రి మాటలకు ఉత్తరాంధ్ర ప్రజలు ఇచ్చే గౌరవం ఇదని అన్నారు. విశాఖపట్నం వేదికగా యోగా దినోత్సవం గిన్నిస్ రికార్డ్ సాధించటం దేశానికి గర్వకారణమని ఉద్ఘాటించారు. ప్రజలు, యోగా సాధకులు స్వచ్ఛందంగా యోగాంధ్రలో పాల్గొన్నారని తెలిపారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. అందుకు ప్రజలు తమవంతు సహకారం యోగాలో పాల్గొని అందించారని చెప్పారు. యోగాంధ్రతో ప్రపంచం అంతా విశాఖపట్నం వైపు చూసిందని వెల్లడించారు. యోగాంధ్రతో విశాఖపట్నం ఖ్యాతి మరోసారి ప్రపంచానికి తెలిసిందని తెలిపారు. ఈ సందర్భంగా యోగాంధ్రని విజయవంతం చేసిన ప్రజలకు, కూటమి నేతలకు, అధికారులకు ఎంవీ ప్రణవ్ గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

--------------

# ముంబై హైవేపై ప్రమాదాల నివారణ

## ప్రమాద ప్రాంతాలను పరీశీలించిన మంత్రి ఆనం

**నెల్లూరు, జూన్ 21, ఆంధ్ర ప్రగతి:** జిల్లాలోని ఆత్మకూరు సమీపంలో ముంబాయి హైవేపై ఏఎస్ పేట క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. చాలా మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు క్షతగాత్రులుగా నిలిచింది. ఆ ప్రాంతాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కృష్ణపట్నం పోర్టు - ముంబాయి జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని.. అధికారులతో స్వయంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర అధికారులతో కలిసి చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 2004 జూన్ నాటికి ఏడాది కాలంలో 22 ప్రమాదాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన చర్యల వల్ల ఈ ఏడాది జూన్ నాటికి 10 ప్రమాదాలు జరిగాయని... ప్రమాదాలని పూర్తిగా నివారించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఆత్మకూరు సర్కిల్‌లో నాలుగు పోలీస్‌స్టేషన్‌ల కింద 2024లో 68 ప్రమాదాల్లో 37 మంది మృతిచెందారని.. ఈ ఏడాది 27 ప్రమాదాల్లో 16 మంది చనిపోయారని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నేతృత్వంలో సాధ్యమైందన్నారు. భవిష్యత్తుతరాలకి ఆరోగ్య ఏపీని అందించే అవకాశం కలిగిందని అన్నారు. ఆదాయం లేని ఆలయాలకు దేవాదాయశాఖ నుంచి నెలకు రూ.10వేలు చొప్పున 5600 ఆలయాలకు ఇస్తున్నామన్నారు. మరిన్ని ఆలయాలను ఈ జాబితాలో చేరుస్తున్నామని... 481 ఆలయాలకు కూడా ఇస్తున్నామని చెప్పారు. అర్చకులకు గతంలో రూ.10 వేలు సంభావనని రూ.15వేలుకు పెంచామన్నారు. ఆలయాల కమిటీలు వేయడానికి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం ఉన్న వాటిని గుర్తించామన్నారు. కమిటీలో బ్రాహ్మణులు, నాయిబ్రాహ్మణలు ఉంటారన్నారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. 600 మంది వేద పండితులకు నెలకు రూ.3వేలు చొప్పున ఇస్తున్నామన్నారు. ప్రధానమైన 21 ఆలయాల్లో నిత్య అన్నప్రసాదం కొనసాగుతుందని మంత్రి ఆనం రామనారాయాన రెడ్డి స్పష్టం చేశారు.

# ఆ నీళ్లను మళ్లిస్తాం :పాక్ గొంతు ఎండాల్సిందే

## అమిత్ షా

**జూన్ 21, ఆంధ్ర ప్రగతి:**



సింధూనదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లు దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటి కొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్‌షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. “ అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయలేం. కానీ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు ” అని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. “ భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం . ఇన్నాళ్లు పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే ” అని అమిత్‌షా దుయ్యబట్టారు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్థాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్థాన్ జీడీపీలో 25 శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే %ా% భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు.

# ఎస్బీఐలో ఉద్యోగాల జాతర...

**జూన్ 21, ఆంధ్ర ప్రగతి:**




స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) భారీస్థాయిలో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీఓ) పోస్టుల భర్తీకి సంబంధించి కీలక ప్రకటన విడుదల చేసింది. ప్రకటన నెం. %జ౯ాణ/జదీూ%/2025-26/03 కింద మొత్తం 2,964 సీబీఓ ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పునఃప్రారంభించినట్లు వెల్లడించింది. ముఖ్యంగా, అరుణాచల్ ప్రదేశ్ మరియు నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు ఇది ఒక శుభవార్త. 10వ తరగతి లేదా 12వ తరగతిలో ఇంగ్లీష్ ను ఒక సబ్జెక్టుగా చదివిన అభ్యర్థులు ఇప్పుడు నార్త్ ఈస్ట్ సర్కిల్ పరిధిలోని పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత సాధించారు. సవరించిన నిబంధనల ప్రకారం, ఆసక్తిగల అభ్యర్థులు జూన్ 21 నుంచి జూన్ 30 వరకు ఆన్ లైన్ లో తమ దరఖాస్తులను సమర్పించవచ్చు.

మొత్తం 2,964 ఖాళీలలో 2,600 రెగ్యులర్ పోస్టులు కాగా, 364 బ్యాక్ లాగ్ పోస్టులు ఉన్నాయి. షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు లేదా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో ఆఫీసర్ స్థాయిలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

నార్త్ ఈస్ట్ సర్కిల్ కు సంబంధించి ఒక ముఖ్యమైన మార్పు చేశారు. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్రాల అభ్యర్థుల కోసం ఇంగ్లీష్ ను నిర్దిష్ట స్థానిక భాషగా చేర్చారు. ఈ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు 10వ లేదా 12వ తరగతిలో ఇంగ్లీష్ సబ్జెక్టుగా ఉత్తీర్ణులై, దానికి సంబంధించిన మార్కుల జాబితా లేదా సర్టిఫికెట్లను సమర్పించగలిగితే, వారు నార్త్ ఈస్ట్ సర్కిల్ లోని ఖాళీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మార్పు కారణంగానే రిజిస్ట్రేషన్ పోర్టల్ ను మళ్లీ తెరిచారు. మిగిలిన నిబంధనలు, షరతులలో ఎలాంటి మార్పులు లేవని ఎస్బీఐ స్పష్టం చేసింది.

అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. 2025 ఏప్రిల్ 30 నాటికి అభ్యర్థుల వయసు 21 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఓబీసీ (ఎన్సీఎల్) అభ్యర్థులకు 3 సంవత్సరాలు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు కేటగిరీని బట్టి 10 నుంచి 15 సంవత్సరాల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

**ఎంపిక ప్రక్రియ మరియు పరీక్షా విధానం**

ఈ నియామక ప్రక్రియలో భాగంగా ఆన్ లైన్ టెస్ట్, అనంతరం స్క్రీనింగ్, ఇంటర్వ్యూ మరియు స్థానిక భాషా ప్రావీణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఆన్ లైన్ టెస్ట్ మరియు ఇంటర్వ్యూలకు 75:25 నిష్పత్తిలో వెయిటేజీ ఇచ్చి తుది ఎంపిక చేస్తారు.

ఆన్ లైన్ టెస్ట్ లో 120 ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లీష్ లాంగ్వేజ్ (30 మార్కులు), బ్యాంకింగ్ నాలెడ్జ్ (40 మార్కులు), జనరల్ అవేర్ నెస్/ఎకానమీ (30 మార్కులు), కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (20 మార్కులు) విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. పరీక్ష సమయం రెండు గంటలు. దీని తర్వాత 30 నిమిషాల పాటు డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో లెటర్ రైటింగ్, ఎస్సే రైటింగ్ ఉంటాయి, వీటికి మొత్తం 50 మార్కులు కేటాయించారు. తప్పు సమాధానాలకు నెగెటివ్ మార్కింగ్ లేదు.

ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -231 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 22 జూన్ 2025

# ప్రపంచ శాంతికి యోగామార్గం



## విశాఖ యోగా డేలో ప్రధాని మోదీ

- ప్రపంచం సంఘర్షణలతో ఉన్నప్పుడు యోగా శాంతి మార్గం
- అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని ఆకాంక్ష
- ఆర్కే బీచ్‌లో మూడు లక్షల మందితో కలిసి ప్రధాని యోగాసనాలు
- యోగా కేవలం వ్యాయామం కాదు, జీవన విధానమని ఉద్బోధ






ప్రపంచం నేడు అనేక సంఘర్షణలు, అశాంతి, అస్థిరతతో సతమతమవుతున్న తరుణంలో యోగా శాంతి మార్గాన్ని నిర్దేశిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విశాఖపట్నంలో ఈ ఉదయం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ జాతీయ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ యోగా దినోత్సవం 'మానవాళి కోసం యోగా 2.0' కు నాంది పలకాలని, దీని ద్వారా అంతర్గత శాంతి ప్రపంచ విధానంగా మారాలని అంతర్జాతీయ సమాజానికి ఆయన పిలుపునిచ్చారు.

మిగతా 4లో

## ఈ నెల 27న కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం



ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నీటి విడుదల ప్రధాన అజెండా

ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నీటి కేటాయింపులపై నిర్ణయం

4లో

## జగన్ కాన్వాయ్ ప్రమాదం

# సింగయ్య మృతిపై కొత్త కోణం!

- జగన్ కాన్వాయ్ ప్రమాదంలో సింగయ్య మృతి ఘటనలో కీలక మలుపు
- మాజీ సీఎం జగన్ ప్రయాణిస్తున్న వాహనమే ఢీకొట్టిందన్న అనుమానాలు
- సీసీటీవీ ఫుటేజ్, వీడియోల ఆధారంగా నల్లపాడు పోలీసుల దర్యాప్తు
- ప్రమాద సమయంలో అక్కడున్న వారిని ప్రశ్నిస్తున్న అధికారులు
- జగన్ వాహనం కింద పడింది సింగయ్యేనా అని నిర్ధారణకు ప్రయత్నం



**అమరావతి,జూన్ 21 ఆంధ్ర ప్రగతి**

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాన్వాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిల్లి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన ఘటన దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో సింగయ్యను ఢీకొట్టింది జగన్ ప్రయాణిస్తున్న వాహనమే అయి ఉండొచ్చన్న మిగతాది 2లో...



## ప్రజల భాగస్వామ్యంతోనే యోగా డే విజయం

- యోగా డే ఘన విజయంపై సీఎం చంద్రబాబు సమీక్ష.. అధికారులకు అభినందనలు
- విశాఖ కలెక్టరేట్‌లో మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమావేశం
- విశాఖలో 3 లక్షల మందికి పైగా యోగా సాధన
- క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో పక్కాగా హాజరు లెక్కింపు

4లో

## ఎన్నికల సిసి ఫుటేజీ ఇవ్వడం కుదరదు

రాహుల్ డిమాండ్‌ను తోసిపుచ్చిన ఎన్నికల సంఘం




4లో

## 300కోట్లు కాదు యోగాంధ్రకు ఖర్చయింది రూ.75 కోట్లే.!



**ఆంధ్ర ప్రగతి విశాఖపట్నం జూన్ 21:**యోగాంధ్ర కార్యక్రమంపై కొందరు వైసిపి బ్యాచ్ సుమారు రూ.300 కోట్లు ఖర్చు చేశారంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఈ కార్యక్రమానికి అయిన మొత్తం ఖర్చు కేవలం రూ.75 కోట్లు మాత్రమే. ఈ నిధులు కూడా కేంద్ర ప్రభుత్వం నుంచే తిరిగి రాష్ట్రానికి వస్తాయి. ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ఈ మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయబడుతుంది. బివైజాగ్ లో నే ఎందుకు నిర్వహించారు. ?

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో, అందునా ఉత్తరాంధ్రలోనీ వైజాగ్ లో నిర్వహించడం మనందరికీ గర్వకారణం. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఎంతో మంది విదేశీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. వైజాగ్ మరియు విజయనగరం మధ్య ఉన్న ప్రాంతాలన్నీ ఐటీ హబ్‌గా, టూరిజం హబ్‌గా మార్చాలనే దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నంలో నిర్వహించారు. విశాఖపట్నానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే ఇలాంటి కార్యక్రమంపై తప్పుడు ప్రచారం చేయడం ఎంతమాత్రం కరెక్ట్ కాదు.



## భారతావనికి దక్కినగౌరవం

- యోగా విశిష్టతను రుగ్వేదం చెబితే...
- ప్రధాన మంత్రి మోదీ విశ్వవ్యాప్తం చేశారు
- వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్

4లో

# ప్రపంచశాంతికి యోగామార్గం

**విశాఖ జూన్ 21 ఆంధ్ర ప్రగతి**
విశాఖలోని ఆర్కే బీచ్‌లో మూడు లక్షల మందికిపైగా ప్రజలతో కలిసి ప్రధాని మోదీ కామన్ యోగా ప్రొటోకాల్ (సీవైపీ)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందం, శాంతిని పెంపొందించడంలో యోగా ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. ఘర్షణల నుంచి సహకారానికి, ఉద్రిక్తతల నుంచి పరిష్కారానికి ప్రపంచాన్ని నడిపించడం ద్వారా యోగా శాంతిని చేకూర్చగలదని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. "దురదృష్టవశాత్తు, నేడు ప్రపంచం మొత్తం ఉద్రిక్తత, అశాంతితో సతమతమవుతోంది. అనేక ప్రాంతాల్లో అస్థిరత పెరుగుతోంది. ఇలాంటి సమయంలో యోగా మనకు శాంతి మార్గాన్ని చూపుతుంది. మానవాళి శ్వాస తీసుకోవడానికి, సమతుల్యం చేసుకోవడానికి, తిరిగి సంపూర్ణంగా మారడానికి అవసరమైన విరామ బటన్ యోగా" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.
యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలపడం. ఇది ప్రపంచాన్ని కలిపింది" అని ఆయన తెలిపారు.



### సాగర తీరంలో అపూర్వ ఘట్టం.. 'యోగాంధ్ర' గిన్నిస్ రికార్డు కైవసం

ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'యోగాంధ్ర-2025' కార్యక్రమం సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విశాఖపట్నం వేదికగా నిర్వహించిన ఈ బృహత్ యోగా ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఈ అపూర్వ కార్యక్రమంలో మూడు లక్షలకు పైగా ప్రజలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

విశాఖ నగరంలోని సుందరమైన రామకృష్ణ బీచ్ నుంచి భీమిలి వరకు విస్తరించిన సుదీర్ఘ మార్గంలో లక్షలాది మంది ప్రజలు ఏకకాలంలో వివిధ యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో, సమన్వయంతో సాగిన ఈ యోగా ప్రదర్శన చూపరులను అబ్బురపరిచింది. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకే చోట, ఒకే సమయంలో యోగా చేయడం ద్వారా గతంలో గుజరాత్‌లోని సూరత్‌లో నమోదైన రికార్డును 'యోగాంధ్ర-2025' అధిగమించడం విశేషం. ఈ భారీ జనసమీకరణతో గతంలో సూరత్‌లో 1,47,952 మందితో నెలకొల్పిన యోగా రికార్డును విశాఖ అధిగమించింది.
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సు పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ గిన్నిస్ రికార్డు సాధించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ కీర్తి ప్రతిష్ఠలు అంతర్జాతీయ వేదికపై మరోసారి ఇనుమడించాయి. విశాఖ సాగర తీరం ఈ చారిత్రక ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది.



### ప్రపంచ యోగా దినోత్సవం... భారతావనికి దక్కిన గౌరవం ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్

ప్రపంచ యోగా దినోత్సవం భారతావనికి దక్కిన గౌరవమని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారు. రుగ్వేదం యోగా విశిష్టతను, గొప్పదనాన్ని చెబితే ... దానిని గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు విశ్వవ్యాప్తం చేశారన్నారు. యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, విశ్వ నరుడు శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు యోగా దినోత్సవాన్ని "యోగా.. ఒకే భూమి, ఒకే ఆరోగ్యం" అనే థీమ్ ను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం విశాఖపట్నం సాగర తీరంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "యోగా భారతీయ జీవన విధానంలో ఒక ముఖ్య భాగం. భారతీయ సనాతన ధర్మం యావత్ మానవాళికి అందించిన వరం. ఇది శరీరం.. మనసు మధ్య సంపూర్ణ సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది. ఈ యోగా క్రియకు ఆది యోగి పరమ శివుడు ఆద్యుడు అయితే... ఆ మహా యోగాన్ని ఆది శేషుడి అంశగా పతంజలి మహర్షి యోగ శాస్త్రం రూపంలో మనందరికీ అందించారు.
౨ శ్రీ నరేంద్ర మోదీ గారే నిలువెత్తు నిదర్శనం
యోగా మన సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగం. సనాతన ధర్మం తాలూకు విశిష్టతను యోగా ద్వారా ఖండాంతరాలకు చేర్చిన ఘనత శ్రీ నరేంద్ర మోదీ గారిదే. యోగా సాధకులు ఎంతటి దృఢ చిత్తాన్ని కలిగి ఉంటారో... ఒత్తిడి జయించి సంకల్ప సాధకులుగా ఎలా నిలబడతారో అన్నదానికి శ్రీ మోదీ గారే నిలువెత్తు ఉదాహరణ. యోగా డే విషయమై శ్రీ మోదీ గారి ప్రతిపాదనకు 177 దేశాలు ఆమోదం తెలిపాయి. ఆయన చొరవతోనే ప్రతి ఏడాది జూన్ 21న ప్రపంచ దేశాలు అంతర్జాతీయ యోగా దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. శ్రీ మోదీ గారి పిలుపు మేరకు మన విశాఖ 11వ యోగా దినోత్సవ సంబరాలకు వేదిక అయ్యింది. శ్రీ మోదీ గారి సమక్షంలో, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ చంద్రబాబు నాయుడు గారి కృషితో ప్రపంచ రికార్డుకు వేదికగా నిలిచింద"న్నారు.

### యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం: సీఎం చంద్రబాబు

యోగా చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఒత్తిడి తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్, కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "యోగాను భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చిన దార్శనిక ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఆయన ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించి, యోగాను ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా మార్చారు," అని కొనియాడారు. నేడు 175కు పైగా దేశాల్లో, 12 లక్షల ప్రదేశాల్లో 10 కోట్లకు పైగా ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు. జాతీయత, ప్రాంతం, మతం, భాషలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను స్వీకరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.
యోగా వల్ల శరీరం, మనసు, ఆత్మల కలయిక జరుగుతుందని, ఇది శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నిర్వహణ, రోగనిరోధక శక్తి పెంపు, ఆత్మవిశ్వాసం, స్వీయ ఆవిష్కరణ, మానసిక ప్రశాంతత, అంతర్గత శాంతి, సంపూర్ణ శ్రేయస్సుకు



దోహదపడుతుందని వివరించారు. దీని ఫలితంగా హింస తగ్గి శాంతి నెలకొంటుందని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ (ఏఐ)తో సహా సాంకేతిక పరిజ్ఞానం యోగాను మరింత అందుబాటులోకి తెచ్చిందని చంద్రబాబు తెలిపారు.ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో నెల రోజుల పాటు యోగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించామని, ఇందులో భాగంగా 1.44 లక్షల మంది యోగా శిక్షకులకు శిక్షణ ఇచ్చి, 1.4 లక్షల ప్రదేశాలలో 2.17 కోట్ల మందికి పైగా భాగస్వాములను నమోదు చేశామని సీఎం వివరించారు. ఒక్క విశాఖపట్నంలోనే నగరం నుంచి భోగాపురం వరకు 28 కిలోమీటర్ల మేర 3 లక్షల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని, మొత్తం 1.7 కోట్ల సర్టిఫికేట్లు జారీ చేశామని వెల్లడించారు. నిన్న 22,122 మంది గిరిజన విద్యార్థులు ఏకకాలంలో సూర్యనమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సాధించడం గర్వకారణమని, వారికి అభినందనలు తెలిపారు.

### ప్రజల భాగస్వామ్యంతోనే యోగా డే విజయం

రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా విశాఖపట్నంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో యోగా దినోత్సవం జరిగిన తీరుపై ఈ సమావేశంలో చర్చించారు.
యోగా దినోత్సవం ఇంతటి ఘన విజయం సాధించడం పట్ల సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సహకారం, వారి క్రియాశీల భాగస్వామ్యం, అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ఇలాంటి ఒక మంచి కార్యక్రమంలో ఇది గొప్ప ముందడుగు అని ఆయన వ్యాఖ్యానించారు.
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలోనూ, పలు ప్రపంచ రికార్డులు సాధించడంలోనూ కీలక పాత్ర పోషించిన మంత్రులు, శాసనసభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి కార్యక్రమాలను విజయవంతం చేసిన తీరును ఆయన ప్రశంసించారు.
యోగా దినోత్సవం రోజున అర్ధరాత్రి 2 గంటల నుంచే ప్రజలు కార్యక్రమ స్థలాలకు తరలిరావడం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా విశాఖపట్నంలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో 3 లక్షల మందికి పైగా ప్రజలు ఉత్సాహంగా యోగా సాధనలో పాల్గొనడంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో పాల్గొన్న వారి సంఖ్యను కచ్చితంగా లెక్కించేందుకు ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం అద్భుతమైన ఫలితాలను ఇచ్చిందని మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో హాజరు లెక్కింపు పక్కాగా జరిగిందని వారు తెలిపారు.

### మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక ప్రధాని అభినందనలు



విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా ముగియడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవ, కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.
యోగా దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను గత నెల రోజులుగా మంత్రి లోకేశ్ వ్యక్తిగతంగా పర్యవేక్షించారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆయన నిరంతర పర్యవేక్షణ వల్లే కార్యక్రమాలు ఇంతటి ఘన విజయం సాధించాయని ప్రశంసించారు. యోగాను కేవలం వ్యాయామంగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక వేడుకగా ఎలా నిర్వహించవచ్చో లోకేశ్ చేసి చూపించారని కొనియాడారు.
అంతేకాకుండా, 'యోగాంధ్ర' పేరిట చేపట్టిన కార్యక్రమాల ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో లోకేశ్ సఫలీకృతులయ్యారని ప్రధాని మోదీ ప్రశంసించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సామాజిక ఐక్యతను కూడా సాధించవచ్చని ఈ కార్యక్రమాల ద్వారా నిరూపితమైందని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖలో జరిగిన యోగా దినోత్సవ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

---

## ఈ నెల 27న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం

**న్యూఢిల్లీజూన్ 21 ఆంధ్ర ప్రగతి**
తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి ఒక కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఈ నెల 27వ తేదీన ప్రత్యేకంగా సమావేశం కానుంది. త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.ఈ సమావేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఖరీఫ్ సీజన్ అవసరాల నిమిత్తం నీటి విడుదలపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సంవత్సరంలో ఇరు రాష్ట్రాల వాటాలు, ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు పోను సాగునీటికి ఎంత కేటాయించాలనే అంశాలపై అధికారులు కూలంకషంగా చర్చించనున్నారు.
ఈ మేరకు కేఆర్ఎంబీ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చింది. రెండు రాష్ట్రాల అధికారులు తమ తమ రాష్ట్రాల అవసరాలు, డిమాండ్లను ఈ సమావేశంలో బోర్డు ముందు ఉంచనున్నారు.

## జగన్ కాన్వాయ్ ప్రమాదం సింగయ్య మృతిపై కొత్త కోణం!

**(మొదటి పేజీ తరువాయి)**
కోణంలో పోలీసులు ఇప్పుడు దృష్టి సారించారు. ఈ మేరకు లోతైన విచారణ జరుగుతోంది.ఇటీవల జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్లలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా గుంటూరు సమీపంలోని ఏటుకూరు బైపాస్ వద్ద జగన్ కాన్వాయ్‌లోని ఓ వాహనం ఢీకొట్టడంతో సింగయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి మరణించారు. తొలుత కాన్వాయ్‌లోని మరో వాహనం ఢీకొట్టినట్లు భావించినప్పటికీ, తాజాగా లభ్యమవుతున్న సమాచారం మేరకు పోలీసులు దర్యాప్తును మరో కోణంలో ముమ్మరం చేశారు.ఈ నేపథ్యంలో, ప్రమాదం జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌లను, ఘటనకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను నల్లపాడు పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రమాద సమయంలో అసలు ఏం జరిగిందనే దానిపై స్పష్టత కోసం ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా, ప్రమాద సమయంలో జగన్ కాన్వాయ్‌లోని ప్రధాన వాహనం కింద పడిన వ్యక్తి మరణించిన చిల్లి సింగయ్యేనా, కాదా అనే విషయాన్ని కూడా నిర్ధారించుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.ఈ కేసుకు సంబంధించి, ప్రమాదం జరిగినప్పుడు ఘటనా స్థలంలో ఉన్న చినకొండ్రుపాడుకు చెందిన కొందరు కార్యకర్తలను, అలాగే వీడియో దృశ్యాల్లో కనిపిస్తున్న ఇతరులను కూడా పోలీసులు విచారించి వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఈ దర్యాప్తు ప్రక్రియలో కొన్ని కీలక ఆధారాలు పోలీసులకు లభించినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోందని, అన్ని కోణాల్లోనూ పరిశీలించి వాస్తవాలను వెలికితీస్తామని పోలీసు వర్గాలు అనధికారికంగా తెలియజేస్తున్నాయి.

## ఎన్నికల సిసి ఫుటేజీ ఇవ్వడం కుదరదు

### రాహుల్ డిమాండ్‌ను తోసిపుచ్చిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,జూన్ 21 ఆంధ్ర ప్రగతి**
మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని బహిర్గతం చేయాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. అటువంటి చర్య చట్టవిరుద్ధమని, ఓటర్ల గోప్యతకు భంగం కలిగించడమే అవుతుందని స్పష్టం చేసింది.
గత ఏడాది మహారాష్ట్రలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, పోలింగ్ సమయంలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పించాయి. ఈ క్రమంలోనే, పోలింగ్‌కు సంబంధించిన 45 రోజుల సీసీటీవీ ఫుటేజీని బయటపెట్టాలని డిమాండ్ చేశాయి. "2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పాటు, మహారాష్ట్ర సహా అన్ని రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు చెందిన ఓటరు జాబితాలను విడుదల చేయాలి. అలాగే, మహారాష్ట్ర ఎన్నికల సీసీటీవీ




ఫుటేజీని కూడా ఈసీ బహిర్గతం చేయాలి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల నేపథ్యంలో ఎన్నికల సంఘం తన వైఖరిని స్పష్టం చేసింది. "సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఒక సమూహాన్ని లేదా ఓటర్‌ను తేలికగా గుర్తించే అవకాశం ఉంటుంది. దీనిని బహిర్గతం చేస్తే, ఓటు వేసినవారు, వేయనివారు కూడా సామాజిక వ్యతిరేక శక్తుల నుంచి ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. ఓటర్లను బెదిరించేందుకూ ఆస్కారం ఉంటుంది. కాబట్టి, ఈ ఫుటేజీని బయటపెట్టడం నిబంధనలకు విరుద్ధం. అలా చేయడం వల్ల చట్టపరమైన సమస్యలు కూడా తలెత్తవచ్చు. ఈ వీడియోలు కేవలం అంతర్గత పర్యవేక్షణ కోసం మాత్రమే ఉద్దేశించినవి. ఎన్నికల వివాదాలకు సంబంధించి ఏదైనా న్యాయస్థానం కోరితే, అప్పుడు మాత్రమే ఆ వివరాలను కోర్టుకు అందజేస్తాం" అని ఎన్నికల సంఘం వివరించింది.
ఇదిలా ఉండగా, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, ఫోటోగ్రఫీ డేటాను 45 రోజుల తర్వాత తొలగించవచ్చని ఈసీ ఇటీవల తెలిపింది. ఎన్నికలపై 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు గానీ, కోర్టు కేసులు గానీ నమోదు కాకపోతే, ఆ ఫుటేజీలను తొలగించాలని ఆదేశించింది. ఎన్నికల సరళి వీడియోలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులకు సూచనలు జారీ చేసింది.

## 22వేల మంది రైతులకు రైతుభరోసా ఎగవేత

**సంగారెడ్డిజూన్ 21 ఆంధ్ర ప్రగతి** రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు ఇవ్వకపోతే ఓఆర్ఆర్‌ను దిగ్బంధం చేస్తామని బిఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 22 వేల మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. 22 వేల మంది రైతు కుటుంబాలతో ఓఆర్ఆర్ పై వంటావార్పు చేసి బంద్ చేస్తామని ప్రకటించారు. శనివారం సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన జిన్నారంలో ఏర్పాటు చేసిన రైతుల మహా ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రైతు భరోసా డబ్బులు ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ఏర్పాటు చేసి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరగకుండా భరోసా కలిపించారన్నారు.రైతులు వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేస్తున్నా ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు చెల్లించడం లేదన్నారు. కేసీఆర్ రైతులకు ఎకరానికి రూ.10 వేలు రైతు భరోసా డబ్బులు ఇవ్వడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫించన్ నెలకు రూ.2 వేలు ఇవ్వగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.4వేలు ఇస్తామని హామీ ఇచ్చారని.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలలో రైతులకు వ్యవసాయం కోసం 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా చేసిందన్నారు. కరెంట్ కోతలు లేకుండ సరఫరా చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు ప్రారంభమైన్నాయని ఆరోపించారు. అనుముల రేవంత్‌రెడ్డి కాదు కోతల రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. పటాన్‌చెరు ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటున్న రైతులు పంటలు సాగు చేసేందుకు అప్పులు చేసుకోనే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల కుటుంబాలు అప్పుల పాలు కావడం జరిగిందన్నారు. రైతు భరోసాను ఎన్నిక భరోసాగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అందరికి ఇస్తామని ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగిలో రైతులకు రైతు భరోసా డబ్బులు వేయలేదని, మండలంలో ఒక్క గ్రామంలో ఉన్న రైతులకు వేశారన్నారు . ఓట్ల కోసం రైతు బంధు పథకంలో డబ్బులు వేస్తామని ప్రకటన చేశారని ఆరోపించారు. ఒక రైతుకు రాష్ట్ర ప్రభుత్వం రైత భరోసా డబ్బులు రూ. 12 వేలు బాకి ఉందని, ముందుగా రైతులకు బాకీ ఉన్న రూ.12 వేలు వేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 22 జూన్ 2025







# ప్రతి ఒక్కరి జీవితంలో నిత్యం యోగా భాగం కావాలి

## -జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న 9 లక్షల మంది. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 21:**
మానవ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా ప్రక్రియను అనునిత్యం భాగస్వామ్యం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డు ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా విశాఖపట్నం నుంచి లైవ్ ద్వారా భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుగారి యోగాంధ్ర కార్యక్రమాన్ని వీక్షిస్తూ యోగా ప్రోటోకాల్ ప్రకారం జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, జిల్లాస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు భారీ సంఖ్యలో దాదాపు 5500 మంది హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని మే 21 నుండి ఈనెల 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగాకు సంబంధించి అనేక కార్యక్రమాలు చేపట్టమన్నారు. జిల్లా వ్యాప్తంగా 5500 ప్రదేశాల్లో దాదాపు 9 లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారని కలెక్టర్ తెలిపారు. పెద్ద ఎత్తున భాగస్వామ్యం అయిన ప్రజలందరికీ జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. పతంజలి, రామచంద్ర మిషన్, యోగా చైతన్య మండలి తదితర సంస్థల నుండి యోగా శిక్షకులచే గ్రామ, మండల స్థాయిల్లో అనేకమందికి శిక్షణ ఇచ్చి యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరి చేత యోగాసనాల వేయించడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన మాస్టర్ ట్రైనర్ల బృందాలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. రెవెన్యూ మున్సిపల్, మెడికల్ , ఆయుష్ శాఖలు గత నెల రోజుల నుండి యోగ విన్యాసాలలో అవగాహన కల్పిస్తూ ప్రతిరోజు నిర్వహించే పనులు ఆన్లైన్లో నమోదు చేస్తూ ఎప్పటికపుడు ఫోటోలను అప్లోడ్ చేశారన్నారు. యోగా కార్యక్రమం పై జిల్లాస్థాయిలో వివిధ రకాల పోటీలను నిర్వహించామన్నారు. మన జిల్లాలో తయారుచేసిన వీడియోకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అలాగే బనగానపల్లి బృందం తయారుచేసిన స్క్రిప్టుకు రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి వచ్చిందన్నారు. యోగాంధ్రపై ఆరు ఉత్తమ గేయాలను అప్లోడ్ చేశామన్నారు. యోగేంద్ర కార్యక్రమంలో విజయదుర్గ బృందం వారు భారత ప్రధానమంత్రి మనకి బాత్ కార్యక్రమంలో ప్రశంసా పత్రం అందుకున్నారన్నారు. అలాగే ఆజాద్ కి అమృత్ మహోత్సవంలో వారు రాసిన కవితకు ఆరు లక్షల బహుమతి అందుకున్నారన్నారు.

ఎంతోమంది ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని "హెల్తీ – వెల్తీ" గా చూడాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచనను ప్రజలలోకి తీసుకెళ్లడానికి జిల్లా యంత్రాంగమంతా కృషి చేసిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో



ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పాత్రికేయులు, మీడియా ప్రసార మాధ్యమాలు జిల్లా యంత్రాంగానికి ఎంతో సహకరించారని ఈ సందర్భంగా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యోగా గురువులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. వెంకటరమణ, మునిసిపల్ కమిషనర్ శేషన్న, ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారి డా. యశోధర, ఆర్డీఓ విశ్వనాథ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, యోగా గురువులు, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనండి.

## -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 21:**
ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మన ఇంటి తో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని టేక్కె మార్కెట్ యార్డు ప్రాంగణంలో11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ యోగాంధ్ర అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మార్కెట్ యార్డ్ లోని పిచ్చి మొక్కలు, చెత్త చదరాన్ని తొలగించి మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జనవరి మాసం నుండి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన స్వర్ణాంధ్రప్రదేశ్ ను సాధించాలన్న సదుద్దేశంతో ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా వివిధ థీమ్స్ తో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు.



ఇందులో భాగంగానే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మన ఇంటి తో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత "క్లీన్ మైండ్ క్లీన్ బాడీ" అనే థీమ్ తో పాటు రెగ్యులర్ థీమ్ అయిన నీరు-మీరు ద్వారా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 వేల ప్రాంతాలలో యోగాంధ్ర



కార్యక్రమాలు చేపట్టడం జరిగిందో ఆయా ప్రదేశాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలు జరిగిన ప్రదేశాలలో ముమ్మర పారిశుద్ధ్య చర్యలు చేపట్టి పరిశుభ్రం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీంతో నంద్యాల జిల్లాను స్వచ్ఛమైన, ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి దోహద పడుతుందన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజల నుండి అధికారుల వరకు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం మార్కెట్ యాడ్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ జెసిలు పాల్గొన్నారు.

### స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో

# పాల్గొన్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 21:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములై పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సిబ్బందిని ఆదేశించారు. శనివారం సాయంత్ర సమయంలో కలెక్టరేట్ లో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ లు పాల్గొన్నారు.తొలుత కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ ఆవరణలో చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే కలెక్టరేట్ కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టరేట్ పరిసరాలలో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ ను ఏరి వేసి శ్రమదానం చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ స్థలాలు, బహిరంగ ప్రదేశాల్లో పరిశుభ్రత పెంపొందించడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల జిల్లాను స్వచ్ఛ జిల్లాగా రూపొందించడంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మాసం యోగాంధ్ర కార్యక్రమాలతో పాటు "క్లీన్ మైండ్ క్లీన్ బాడీ" అనే థీమ్, నీరు-మీరు ద్వారా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.అనంతరం డిఆర్ఓ రామునాయక్, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది, కలెక్టరేట్ లో ఉన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది...పాల్గొన్న వారందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం లో పాల్గొన్న అభి రుచి మధు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 21:** 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు చేస్తున్నటువంటి యోగ డే కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధుగారు యోగ డే సందర్భంగా నంద్యాలలోని వెంకటేశ్వర విద్యా మందిర్ ఆవరణంలో యోగా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర విద్యా మందిర్ అధినేత వెంకట్ రాముడుగారు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేడ మురళి డాక్టర్ ఇంటి ఆదినారాయణ యోగ కన్వీనర్ నిమ్మకాయల సుధాకర్ మూడవ పట్టణ అధ్యక్షుడు లక్ష్మీ రెడ్డి పాల్గొనడం జరిగింది. నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచిమధు మాట్లాడుతూ యోగ అనేది ప్రతి ఒక్కరికి ఆరోగ్యాన్నిస్తుంది. యోగ వలన. ప్రతి ఒక్క మనిషి ఆరోగ్యంగా జీవించగలడు యోగ చేయడం వలన శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం కలిగి విద్యార్థులు మంచి ఉన్నత స్థితికి చేరవచ్చు యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు నరేంద్ర మోడీ మోదీ పిలుపుమేరకు ప్రపంచంలో ని 175 దేశాలు యోగాను అనుసరించడం జరిగింది. యోగా అంటే శ్వాస మీద ధ్యాసే కాదు. యోగా అంటే వ్యాయామమే కాదు యోగా అంటే ఒక జీవనశైలి అని మాట్లాడిన జిల్లా అధ్యక్షుడు అభిరుచిమధు మాట్లాడడం జరిగింది. కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ నాయకులు ఎర్రమల బాలముని రమణ తదితరులు అంతర్జాతీయ యోగ డే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# నెరవాడలో యేసు కృపా మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మేగా మెడికల్ క్యాంప్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:**నెరవాడ గ్రామంలో యేసు కృప మినిస్ట్రీస్ ట్రస్ట్ ద్వారా బ్రదర్ అందనం ఏసన్న ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిరవాడ గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగినది. ఈ మెడికల్ క్యాంపుకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వారికున్నటువంటి సమస్యను బట్టి డాక్టర్స్ తో చూపించుకున్నారు. వారి సమస్యను బట్టి డాక్టర్స్ వారికి ట్రీట్మెంట్ చేయడం జరిగింది. ఇందులో విజన్ ఐ కేర్ డాక్టర్ ఉబ్బతి విజయ మోహన్, సన్ షైన్ డెంటల్ కేర్ డాక్టర్ మనోజ్ కుమార్, ఆడియాలజిస్ట్ డాక్టర్ వై.వి.రత్నాకర్ పాల్గొని వారి సేవలను అందించారు. పాస్టర్ కుప్పెర సునీల్, ఏసన్న, మనోహర్, డాక్టర్ మనోహర్, బెన్ హిన్ పుటికెల, కడియం క్లైమేట్, సంపత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచి రాంభూపాల్ రెడ్డి,టిడిపి నాయకులు అమరసింహా రెడ్డి ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించారు.యేసు కృపా మినిస్ట్రీస్ ట్రస్ట్ ద్వారా ఇలాంటి సేవా కార్యక్రమాలు అనేకం చేస్తామని యేసు కృపా ట్రస్ట్ చైర్మన్ అందనం ఏసన్న తెలిపారు.

# బాల అకాడమి పాఠశాలలో ఘనంగా..
# అంతర్జాతీయ యోగ దినోత్సవము.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21** నంద్యాల పట్టణం లోని పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమి పాఠశాలలో జూన్ 21 వ తేదిన అనగా శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవంను జరుపుకోవడము జరిగినది. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ మరియు ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొని మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతాలలో యోగ ఒకటి మనీషి శారీరిక, మానసిక ప్రశాంతతకు మరియు ఆరోగ్యానికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుంది. అందుకే ప్రపంచంలోని అనేక దేశాలు యోగ దినోత్సవంను జరుపుకోవడం జరుగుతుంది. యోగ అనే పదం సంస్కృత పదమైన ఎజా అనే పదం పుట్టింది. ఎజా అనగా దేనినైనా ఏకము చేయగలగడము. అని అర్థం. ఆసనం అనగా సంస్కృతంలో భంగిమ అని అర్థం. ఈ రెండిటిని కలిపి యోగాసనం అంటారు. మనసును, శరీరాన్ని ఏకం చేసి, అధ్యాత్మకంగా ప్రశాంతతను కలిగించేదే యోగ. 2025 వ సంవత్సరపు యోగ థీమ్ ఏమనగా ఒక భూమికి యోగ ఒక ఆరోగ్యం అనగా మనిషి ఆరోగ్యానికి మరియు భూమికి మధ్య గల సంబంధాన్ని జాగ్రత్తగా చూసుకోవడము. అని అర్థము అని తెలియజేశారు.

## పేద ముస్లిం కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన
# తాటికొండ బుగ్గ రాముడు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:** నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు నివాసం ఉంటున్న మరో పేద ముస్లిం కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన 38వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తాటికొండ బుగ్గరాముడు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి.ఫరూక్,నంద్యాల జిల్లా ప్రాధన కార్యదర్శి ఎన్ ఎం డి.ఫిరోజ్,రాష్ట్ర యువ నాయకుడు ఎన్ ఎండి.ఫయాజ్ ఆదేశాల మేరకు 38వార్డు నందు నివాసం ఉంటున్న పేద ముస్లిం వ్యక్తి అల్లబకాష్,వహిదాబి గార్ల కూతురు వివాహానికి 5000/-రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. అంతేకాక వార్డు నందు ఎవరి వివాహం జరిగిన వార్డు నందు ఎవరు మరణించిన కులమతాలకు అతీతంగా వారికి ఆర్థిక సహాయం దాదాపుగా 3 సంవత్సరాలుగా చేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు.ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్నందుకు ఇంచార్జ్ బుగ్గరాముడు గారిని వార్డు ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్ బాబు,చిన్న రాముడు,మోజస్,హిమాం హుస్సేన్,నాగరాజు తదితర టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణ పై అవగాహన కార్యక్రమం.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ జూన్ 21:**డీఐజీ కర్నూల్ సూచనలు మరియు నంద్యాల జిల్లా ఎస్పీ అధి రాజ్ సింగ్ రానా, ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీ ప్రమోద్ కుమార్ నేతృత్వంలో ఆళ్లగడ్డ సబ్-డివిజన్ లోని శిరివెళ్ల మరియు ఆళ్లగడ్డ పట్టణ పరిధిలో సమగ్ర ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు హెల్మెట్ ప్రాముఖ్యత, రహదారులు దాటి వెళ్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే జాతీయ రహదారి ఎన్ హెచ్-40 లోకి ప్రవేశించే సమయంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించబడింది. గ్రామీణ ప్రయాణీకులకు రోడ్డు భద్రత నిబంధనలపై స్పష్టతనిచ్చారు.తల్లిదండ్రులకు తమ పిల్లలను అధికంగా లోడ్ అయిన ఆటోలలో పాఠశాలలకు పంపకూడదని కౌన్సిలింగ్ ఇవ్వబడింది. ఆటో డ్రైవర్లను సరైన డాక్యుమెంట్లు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రయాణికుల అధిక లోడ్‌తో ఆటోలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి కార్యకలాపాలను సహించబోమని హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించబడుతుంది మరియు జరిమానాలు విధించబడతాయి.

# జనాభా పెరుగుదలే అభివృద్ధికి ఆటంకం
## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ,:ఆర్థికంగా దేశం బలపడకపోవడానికి దేశ జాభా కారణమని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలో తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ఓ ప్రశ్నకు స్పందిస్తూ.. దేశ జనాభా ఇందుకు కారణమన్నారు. జనాభా నియంత్రణను భాషా లేదా మతపరమైన సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా చూడాలన్నారు. చాలా అభివృద్ధి జరుగుతున్నా.. ఫలితాలు మాత్రం అందరికీ అందడం లేదన్నారు. ఇందుకు జనాభా పెరుగుదలే కారణమన్నారు. గత రెండు పర్యాయాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గడ్కరీ ప్రస్తావించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 11 ఏళ్లలో చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మిగిలే ఉందని వ్యాఖ్యానించారు. ఏదేమైనా తాను చేయాల్సిన పనులను పార్టీ నిర్ణయిస్తుందని, ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'ఇప్పటివరకు చూసిందంతా న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు. కార్యకర్తలు ఏం చేయాలి, బాధ్యతలు ఏంటనే విషయాన్ని పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ అప్పగించిన బాధ్యతలను నేను నిర్వర్తిస్తా. ఇటీవల రోడ్ల పనుల కంటే వ్యవసాయం ఇతర సామాజిక కార్యక్రమాలపై నేను ఎక్కువగా దృష్టి సారిస్తున్నా' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# ప్రైవేట్,కార్పోరేట్ స్కూళ్ల అవినీతి దందా పై రౌండ్ టేబుల్ సమావేశం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:**
నంద్యాల పట్టణం లో రాజ్ థియేటర్ ఎదురుగా వున్న అల్ మదద్ కంప్యూటర్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్ నందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది.
డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్.రియాజ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బందేల ఓబులేసు రాష్ట్ర కార్యదర్శి పూల వెంకట్, ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగసారి సుంకన్న,ఆర్వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్ర, పీడీఎస్ యు రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంబాబు ఎస్ఎఫ్ఐ అవునా నంద్యాల టౌన్ సెక్రెటరీ సందీప్, ఏఐఎస్ఎ జిల్లా కార్యదర్శి నాగార్జున,సమాజ్ వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెరుగు శివ కృష్ణ యాదవ్,జీవీఎస్ రాయలసీమ జిల్లాల ఇన్చార్జి ముడవత్ రవీంద్ర నాయక్, వైఎస్ఆర్సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్,బీవీఎస్ అధ్యక్షుడు పాలుట్ల రమణ,ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు,ఎస్సి విద్యార్థి సంఘం నాయకులు దిలీప్ రాజు మాట్లాడుతూనంద్యాల జిల్లాలో ప్రైవేట్ , కార్పొరేట్ స్కూల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడి జరుగుతున్నప్పటికీ నియంత్రించడంలో డీఈవో జిల్లా అధికారులు పూర్తిగా విఫలం చెందారనీ,నంద్యాల జిల్లాలో ప్రైవేట్,కార్పోరేట్ విద్య సంస్థలు విచ్చల విడిగా విద్యార్థుల తల్లింద్రులు దగ్గర ఫీజుల రూపంలో తల్లి తండ్రుల రక్తం తాగుతున్నారని,ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ పేరులతో కొంత మంది ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం దందా చేస్తున్నారని,ప్రైవేట్ విద్యాసంస్థలు-ఫీజుల వివరాలు ఉత్తర్వులు. జీవో నెంబర్.1 ప్రకారం పాఠశాలలు ఐదు శాతానికితగ్గకుండా లాభాలను మాత్రమే ఆశించాలనీ వున్న కూడా ఆ జివో నీ ఉల్లగించారని. వసూలు చేసిన ఫిజుల్లోంచి 50%మొత్తాన్ని ఉపాధ్యాయులకు వేతనాలుగా చెల్లి%శీ%చాలనీ.ప్రతి ఏడాది వార్షికనివేదికలు,ఆడిట్ రిపోర్ట్స్ ప్రభుత్వానికి సమర్పించాలనీజీవో నెంబర్.42 ప్రకారం ఫీజులను పెంచాలంటే డిస్ట్రిక్ట్ ఫీ రేగ్యులేషన్ కమిటీ అనుమతి తీసుకోవాలనీ, జీవో నెంబర్.246 ప్రకారం పాఠశాలల నిర్వాహణలో సమాజాన్నిభాగస్వామ్యం చేయాలనీ సీబియస్ఈ చట్ట ప్రకారం ప్రతి పాఠశాలలో 'పేరెంట్‌టీచర్ అసోసియేషన్' ఏర్పాటుఈ చేసుకోవాలి.ఈ అసోసియేషన్లో ఇద్దరుతల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించాలనీ.వీరిని సంప్రదించిన తరువాతనేఫిజులను పెంచాలనీ, జీవో నెంబర్.91 ప్రకారం వన్ టైం ఫిజుగా అప్లికేషన్ ఫీజు రూ100, రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.500,రిఫన్డబుల్ కాషన్ డిపాజిట్ రూ.5000లకు మించకుండా తీసుకోవాలనీ.జీవోలోని సెక్షన్ 1(సి) ప్రకారం పాఠ్యపుస్తకాలు,స్టేషనరీ, యూనిఫాంలను స్కూల్ యాజమాన్యం సూచించే చోటే కోనాలన్న కచితమైననిబంధనలేమి పెట్టరాదనీ.వీటి అమ్మకాలకు పాఠశాలలల్లో కౌంటర్లు ఏర్పాటుచేయరాదనీ.విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చిన షాపులో కొనుగోలు చేయవచ్చు.జీవో నెంబర్.780 సెక్షన్ 8(1) ప్రకారంపాఠశాలల బోర్డులపై ఇంటర్నేషనల్,ఐఐటి, ఒలంపియాడ్, కాన్సెప్ట్,ఈటెక్నో,ఈ శాస్త్ర అన్న తోకలేవి తగిలించరాదు.కేవలం పాఠశాల అని మాత్రమేపేర్కోనాలనీ జర్నలిస్ట్ పిల్లలకు రాయితీలు ఇవ్వాలి కనీసం 50% తగ్గకుండా చూడాలనీ వారు డిమాండ్ చేశారు.

# కొలిమిగుండ్ల గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయ ఉద్యోగస్తులను సస్పెండ్ చేయాలి.

## -ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం.

**ఆంధ్ర ప్రగతి కొలిమిగుండ్ల జూన్ 21:**
నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని గ్రామీణ ఉపాధి కార్యాలయంలోని పనిచేసే ఉద్యోగులు విధుల సమయంలో విందుల పేరుతో తప్ప తాగి చిందులు వేయడము దుర్మార్గమని ఇలాంటి వారిని ప్రభుత్వ ఉన్నత అధికారులు జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన ఉద్యోగులను సస్పెండ్ చేయాలని. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బి కే యం యు జిల్లా అధ్యక్షుడు కె.రాధాకృష్ణ.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ..



నంద్యాల జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలు అంతు లేకుండా పెరిగిపోయాయని అందుకు ఉదాహరణ కొలిమిగుండ్ల మండలంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న ఉద్యోగులు ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన విందుకు వారు విధులు చేయాల్సిన సమయంలోనే మద్యం సేవించి చిందులు వేయడం ఆ దుశ్యాలు సోషల్ మీడియాలో వీడియో హల్చల్ చేయడము జరిగిన పై అధికారులు తమను ఏమి చేయలేరని లెక్కలేని తనంతో ఉపాధి కూలీలకు కడుపు కొట్టే రీతిలో ప్రోక్కు లైన్లతో పనులు చేపించి ఉపాధి కూలీలతో పనులు చేపించినట్టు లెక్కలు చూపి వచ్చిన డబ్బుతో ఇలా మద్యం సేవించడం పై అధికారులు కూడా ఏమి పట్టించుకోక పోవడముతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని వెంటనే పై స్థాయి అధికారులు జరిగిన సంఘటన పై విచారణ జరిపించి అందుకు బాధ్యులైన ఉద్యోగులను సస్పెండ్ చేయాలని లేని పక్షంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్మిస్తామని పై నాయకులు అధికారులను హెచ్చరించారు.

# అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి.

## -సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 23న కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా. -జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 21:**
అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం,అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు యశోద,విజయలక్ష్మి డిమాండ్ చేశారు.అంగన్వాడీల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం అదేవిధంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని వారు తెలిపారు.ఈ మేరకు శనివారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం దగ్గర సూపర్వైజర్లు శోభారాణి,అరుణ గారికి సమ్మె నోటీసులు అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద గర్భిణీలు,బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు,మినీ వర్కర్లు అనేక సేవలు అందిస్తున్నారన్నారు. అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు రకరకాల పెట్టుబడులు పెట్టి సెంటర్లు నిర్వహిస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా అంగన్వాడీలకు వేతనాలు మాత్రం పెరగడం లేదని అంగన్వాడీలకు కేవలం గౌరవ వేతనాలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కానీ అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా



నమోదు అయినందున సంక్షేమ పథకాలు అమలు కావడంలేదని తల్లికి వందనం అమలు కావడం లేదని,రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ రావడంలేదని,రేషన్ కార్డు కొరకు అప్లై చేస్తే ప్రభుత్వ ఉద్యోగులు అని తిరస్కరిస్తున్నారని కావున అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నైనా గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలనైనా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.గ్రాట్యూటీ జీవో నెంబర్ 8ని మార్పు చేయాలని,పెన్షన్,పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని,మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వాలని,వేసవి సెలవులు ఇవ్వాలని,అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు రకరకాల యాపులు పెట్టారని కానీ ఫోన్లు సరిగా పనిచేయడం లేదని అనేక ప్రాంతాలలో నెట్ సిగ్నల్స్ ఉండడం లేదని కావున సెంటర్ నిర్వహణకు ట్యాబ్ లు ఇవ్వాలని,ఎఫ్.ఆర్.ఎస్ ను రద్దు చేయాలని,బాల సంజీవిని యాప్ లో మార్పులు చేయాలని వారు కోరారు.లేబర్ కోడ్ లను రద్దు చేయాలని,రైల్వే, విద్యుత్,స్టీలు,బ్యాంకులు, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ రంగాల్లో ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని వారు డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నా అదేవిధంగా జూలై 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు నాగలక్ష్మి,మాధవి,సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, పారిశుద్యానికే మొదటి ప్రాధ్యానత.

## మున్సిపల్ కమిషనర్ శేషన్న. - నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరిక.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:**
నంద్యాల మున్సిపల్ పరిధిలో ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటం కోసం పరిసరాల పరిశుభ్రత, పారిధ్యానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. శనివారం ఆయన మీడియతో మాట్లడుతూ, నంద్యాల మున్సిపల్ పరిధిలోని మొత్తం 42 వార్డుల్లో ప్రతి రోజు పరిస్తితులను సమీక్షిస్తున్నామని చెప్పారు. తానూ ఇప్పుడే విధుల్లో చేరి భాధ్యతలు స్వీకరించానని పూర్తీ స్థాయిలో విషయాలు తెలుసుకోవడానికి కొంత సమయం పడుతుందని ఆయన అన్నారు.మున్సిపల్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్ళడానికి ప్రణాళిక సిద్దం చేసుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్ శేషన్న చెప్పారు. ఇప్పటికే అన్ని వార్డుల్లో జరుగుతున్నా అభివృద్ధి పనులతో పాటు, అక్కడి సమస్యలను నేరుగా వెళ్లి తెలుసుకొనే ప్రయత్నం చేస్తున్నాని ఆయన చెప్పారు. ప్రస్తుతం వర్శాకాలన్ని దృష్టిలో పెట్టుకొని, వర్షపు నీరు ఎక్కడ నిలువ ఉండకుండ చర్యలు తెసుకోవాలని సంభందిత అధికారులను, సిబ్బందిని ఆదేశించినట్టు ఆయన తెలిపారు. నంద్యాల పట్టణంలో పారిశుద్యం సమస్యల పై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని.. వీటిలో ఒక్కదాన్ని పరిష్కరిస్తూ ముందుకు వేల్లుతున్నామన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలె అవకాశాలు ఎక్కువ ఉండటంతో ముందస్తుగా ఆయ ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నాట్టు కమిషనర్ పేర్కొన్నారు.ఇప్పటికే బ్లీచింగ్, ఫాగింగ్, ఆయిల్స్ తదితర సామాగ్రిని సిద్దం చేసి ఉంచామని ఆయన చెప్పారు. నంద్యాల మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న సిబ్బంది, అధికారులు తమ బాధ్యతలను నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న స్పష్టం చేశారు.నంద్యాల మున్సిపల్ పరిధిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించడం, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. పట్టణంలోని ప్రతి రోజు చెత్త సేకరణ చేసే సిబ్బందికి, ప్రభుత్వం సరఫరా సబ్బులు, ఆయిల్స్, చెప్పులు, తదితర కిట్లను త్వరలో అందజేస్తామని ఆయన చెప్పారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు తాగునీరును అందించడానికి చర్యలు తీసుకున్తున్నాని ఆయన తెలిపారు. తాగునీరి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం యుద్ధ ప్రాదిపదికన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.అలాగే, నంద్యాల మున్సిపల్ పరిధిలో పన్ను వసూళ్ళ పై దృష్టిసారించి, ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవడానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నంద్యాల మున్సిపాలిటీని అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు.



నంద్యాల పట్టణంలో మున్సిపల్ సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించే విధంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, ఆకస్మిక తనిఖీలు చేస్తామని ఆయన చెప్పారు.
మున్సిపల్ పరిధిలో ఏ శాఖలో ఏం జరుగుతుందో.. అన్న విషయం పై ఇప్పటికే దృష్టి పెట్టామని, ఆయ శాఖల్లో ఎవరు విధులు నిర్వహిస్తున్నారో.. ఎవరు బాధ్యతరాహిత్యంగా ఉన్నారో...తదితర విషయాల పై ఇప్పటి ఓ నివేదికను సిద్దం చేస్తున్నట్టు కమిషనర్ బి. శేషన్న సూచనాప్రాయంగా చెప్పారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 22 జూన్ 2025

# నంది గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:**
అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా "ఒకే భూమి- ఒకే ఆరోగ్యం" అనే ఈ సంవత్సరపు గ్లోబల్ థీమ్‌కు అనుగుణంగా, మా ప్లాంట్ ప్రాంగణంలో విశేషంగా యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని మేము గర్వంగా పంచుకుంటున్నాము.

ఈ కార్యక్రమం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంతోపాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రేరేపించడంలో, ఉద్యోగుల మధ్య మరియు పరిసర ప్రాంతాల ప్రజల మధ్య ఐక్యతను బలపరచడంలో ముఖ్యపాత్ర వహించింది. ఈ కార్యక్రమంలో 400 మందికిపైగా ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకకు





ముఖ్య అతిథిగా కంపెనీ డైరెక్టర్ శ్రీమతి సుజల ని ఆహ్వానించటం మాకు గౌరవంగా ఉంది. ఆమె తన ప్రేరణాత్మక ప్రసంగంలో, వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితాలలో యోగా యొక్క మార్పు తేవగల శక్తిని గురించి పేర్కొన్నారు. యోగా ని ప్రతిరోజూ జీవనశైలిలో భాగంగా మార్చుకోవడం ద్వారా మేము మరింత కేంద్రీకృతమైన, ఒత్తిడి లేని, ఉత్పాదకతతో కూడిన జీవితం గడపవచ్చని ఆమె తెలిపారు. మేనేజ్‌మెంట్ నుండి ఇతర ప్రముఖులు కూడా పాల్గొని తమ మద్దతును వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రామిరెడ్డి వంశీ, శేషిరెడ్డి ,మహేశ్వర రెడ్డి,గోపాల్ రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి ,వెంకట రామిరెడ్డి మరియు మానవ వనరుల విభాగం సిబ్బందిచేత విజయవంతముగా నిర్వహించారు.

# జిల్లాలో రోడ్డు ప్రమాదాల పై అవగాహన కార్యక్రమం.

**-రోడ్డుభద్రత,ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.. సురక్షితంగా గమ్యం చేరండి. -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ జూన్ 21:** జిల్లాలో ప్రతి శనివారం రోడ్డు ప్రమాదాల నియంత్రణ కొరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్న కర్నూలు రేంజ్ డీఐజీ శ్రీ కోయ ప్రవీణ్ ఆదేశాలమేరకు మరియు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచనలతో జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ ల పరిధిలలో సంబంధిత పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు హెల్మెట్ ప్రాముఖ్యత, రహదారులు దాటి వెళ్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే జాతీయ రహదారి ఎన్ హెచ్-40 లోకి ప్రవేశించే సమయంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించబడింది. గ్రామీణ ప్రయాణీకులకు రోడ్డు భద్రత నిబంధనలపై స్పష్టతనిచ్చారు. తల్లిదండ్రులకు తమ పిల్లలను పరిమితికి



మించి ప్రయాణించే ఆటోలలో పాఠశాలలకు పంపకూడదని కౌన్సిలింగ్ ఇవ్వబడింది. ఆటో డ్రైవర్లను సరైన డాక్యుమెంట్లు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రైవర్ సీట్ కు ఇరువైపులా ప్రయాణికులను కూర్చోబెట్టుకోరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, పై సూచనలను పాటించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని,



మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అవగాహన కల్పించడం జరిగింది.

రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించబడుతుంది మరియు జరిమానాలు విధించడం జరుగుతుందని తెలియజేశారు.

# యోగా సాధన ఆరోగ్య వర ప్రదాయిని.

## ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:** శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలేజీ ఎన్సిసి యూనిట్స్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ డే కార్యక్రమం ఎన్సిసి క్యాడేట్స్ యోగాసనాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అందరూ కుల మతాలకు అతీతంగా యోగ సాధన చేయాలి. దాదాపుగా 120 దేశాలు యోగాను అంగీకరించాయి. 11 సంవత్సరాల క్రితం నరేంద్ర మోడీ యోగా సైన్స్ గురించి 2014లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో చెప్పినప్పుడు అన్ని దేశాలు అంగీకరించి దాదాపుగా 120 దేశాలు జూన్ 21 తారీకున అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని అంగీకరించారు. ఆ విధంగా ప్రతి సంవత్సరం జూన్ 21వ తారీకున అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటూ ఉన్నారు.

ముఖ్యంగా మన రాష్ట్ర ప్రభుత్వము మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర మాసంగా ఒక భూమి కోసం యోగ, ఒక ఆరోగ్యం థీమ్ గా ప్రకటించి ప్రతి ఒక్కరు యోగాను అభ్యాసం చేయాలని యోగా మన జీవితంలో భాగం కావాలని యోగా అంటే ఆరోగ్యమని ప్రతి ఒక్కరూ సంతోషకరమైన ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలంటే యోగా సాధన ముఖ్యం అని అన్నారు. కాబట్టి అందరూ కులమతాలకు అతీతంగా యోగ సాధన చేయాలని యోగా సాధనాలు చేయడం వలన



శరీరము మనసు బుద్ధి ఏకమై శారీరక మానసిక దృఢత్వం కలుగుతుందని ముఖ్యంగా విద్యార్థులు ఎన్సిసి క్యాండిడేట్స్ యోగ సాధన ప్రతిరోజూ చేయాలని అందువలన ఏకాగ్రత పెరుగుతుందని మంచి సత్ప్రవర్తన కలుగుతుందని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని,ఎంత బిజీగా ఉన్నా యోగా కోసం ఆరోగ్యం కోసం సమయాన్ని కేటాయించాలని ఈ యాంత్రిక యుగములో ప్రతి ఒక్కరి జీవిత%శీ% ఉరుకుల పరుగుల మయం నాగరికతల పేరుతో ఆధునిక విద్య పేరుతో మన ప్రాచీన విద్యలను కళలను మరచిపోతున్నామని, అలాగే అతి పురాతనమైన భారతీయ ఋషులు మహాపురుషులు ఆచరించిన అత్యంత ప్రాచీనమైన యోగా సాధన నేడు ఇంత ప్రాచుర్యం పొందడం సంతోషించదగ్గ విషయమని కాబట్టి ప్రాణాయామము, ధ్యానం, విశ్రాంతి, ఆసనాలు, ఆరోగ్యం, ఇన్ని విషయాల కలయిక యోగాని అందువలన యోగాను సైన్సుగా శాస్త్రంగా ప్రపంచంలోనే చాలా దేశాలు అంగీకరించాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీ కేబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయాలి దానివలన ఆరోగ్యంగా ఆనందంగా ఉండగలుగుతామని అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఎన్సిసి



క్యాడేట్స్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. నంద్యాలసత్య సాయి ధ్యాన మండలి మరియు తొమ్మిదవ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్,రామకృష్ణ కళాశాల ఎన్సిసి బాయ్స్ మరియు గర్ల్స్ విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగాడే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్పీవై రెడ్డి కళాశాల ఎన్సిసి క్యాటెట్స్ కూడా పాల్గొన్నారు.

యోగాసనాలు కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ లలితా సరస్వతి సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు శ్రీ సునీల్ కుమార్ ఆసనాలు వేయించి విద్యార్థులకు సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ధ్యాన మండలి సభ్యులు శ్రీ ఎం సి కొండయ్య, సుదర్శన్, శ్రీ సునీల్ కుమార్, వెంకటరెడ్డి, కృష్ణ, ప్రకాష్, మరియు ఎన్సిసి ఆఫీసర్స్ లక్ష్మీ దుర్గ, లెఫ్టినెంట్ రూత్, లెఫ్టినెంట్ కమల్ ఖాన్, కళాశాల అధ్యాపకులు రత్నారెడ్డి, మహేష్ గుప్తా, శ్రీమతి హిమబిందు, ప్రసాద్, ఇంతియాజ్,శేఖర్, ఆంద్రూస్ ,మురళీధర్, మస్తాన్, బాలచంద్రుడు కళాశాల ఎన్సిసి క్యాడేట్స్ ఎస్పీవై రెడ్డి మహిళా కళాశాల ఎన్సిసి క్యాడేట్స్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జాతీయ గీతం తో జయప్రదం చేశారు.

# దివ్యాంగుల ఉపకరణాల ప్రత్యేక వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి.

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో ఏర్పాటు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకం.**

**-ఈనెల 26వ తేదీ నంద్యాల పురపాలక టౌన్ హాల్లో లబ్ధిదారుల ఎంపిక శిబిరం.**

**-ఎ.డి.ఐ.పి: కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సహాయ పరికరాల ఉచిత పథకం.**

**-అలిమ్ కో: భారత కృత్రిమ అవయవాల తయారీ కార్పొరేషన్ సహకారంతో**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 21:**
నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి చొరవతో కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ తరపున, దివ్యాంగుల, వృద్ధుల సహాయ పరికరాలు, ఉపకరణాల ఉచిత పథకం ఎ.డి.ఐ.పి లో భాగంగా, భారత కృత్రిమ అవయవాల తయారీ కార్పొరేషన్ అలిమ్ కో సహకారంతో, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు,వృద్ధుల సంక్షేమ శాఖ నంద్యాల జిల్లా కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా నిర్వహణలో ఈనెల 26 వ తేదీ, గురువారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నంద్యాల ఎన్టీఆర్ మున్సిపల్ టౌన్ హాల్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో హాజరైన దివ్యాంగులు, వృద్ధులను పరీక్షించి వారికి అవసరమైన వారికి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, మూడు చక్రాల సైకిళ్ళు, చక్రాల కుర్చీలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతి కర్రలు ఉచితంగా అందించడానికి ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ శిబిరానికి హాజరయ్యే వారు సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, వికలత్వం కనిపించే ఫోటోలు మూడు, స్వావలంబన కార్డులు తీసుకురావలసి ఉంటుంది. పరికరాలు తయారైన తర్వాత ఎంపికైన వారిని పిలిపించి అందజేస్తారు. ఈ శిబిరాలు నంద్యాల తర్వాత జూన్ 28వ తేదీ నందికొట్కూరులో, జూలై నెలలో ఒకటవ తేదీ ఆళ్లగడ్డలో, 4వ తేదీ ఆత్మకూరులో, 8వ తేదీ బనగానపల్లె లో , 11వ తేదీ డోన్ లో, 15వ తేదీ పాణ్యం లో నిర్వహిస్తారు. ఈ సదవకాశాన్ని నంద్యాల జిల్లాలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని, ఆయా తేదీల్లో ఈ శిబిరాలకు అవసరం ఉన్న ప్రతి ఒక్కరూ హాజరు కావాలని నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, అధ్యక్షులు ఎంపీవి రమణయ్య, కార్యదర్శి రామలింగం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు.

# రోజు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం.



**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 21:** ప్రతిరోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యకరంగా ఉంటామని పాఠశాలల కరస్పాండెంట్లు సిధిన్ సాముయెల్, మల్లెల శ్రీను తెలిపారు. శనివారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని క్రీస్తు జ్యోతి,శివరామకృష్ణ,సాయి గీతాంజలి పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనశైలిలో యోగా అనేది చాలా ముఖ్యం అని, ఆరోగ్యవంతమైన జీవితానికి ఒత్తిడి లోను కాకుండా చదువుకోవడానికి యోగా ఎంతో దోహదపడుతుందని,యోగాతో క్రమశిక్షణ మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పుల వలన ప్రజలు అనేక రకాలైన రోగాల బారిన పడుతున్నందున, యోగాను ప్రతి ఒక్కరు ఆచరించుటకు గాను మానవాళికి యోగా విశిష్టతను, ప్రాముఖ్యతను తెలియజేసి శరీరాన్ని, మనస్సును శుద్ధిచేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు యోగ దోహదపడుతుందన్నారు. ప్రాణాయామం, ద్యానం, పంచాక్షరి, మంత్రపఠవం యోగాలో ఒక భాగమే అని, యోగాతో చక్కటి శరీర సోష్టాన్ని కూడా సొంతం చేసుకునే అవకాశం ఉందన్నారు. నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలకు పాటే పునాది కావాలి.

**ప్రజానాట్యమండలి పాట ప్రజా ఉద్యమాలకు బాట.**

**ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 21:**
సమాజంలో జరుగుతున్న అసమానతలను సరిచేసి సమ సమాజ నిర్మాణానికి ఎర్రజెండా నాయకత్వంలో జరిగే ప్రజా ఉద్యమాలకు ప్రజానాట్యమండలి పాట పునాది గా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య స్పష్టం చేశారు. శనివారం డోన్ పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆట పాట రెండవ రోజు ముగింపు శిక్షణ తరగతులు వాసు అధ్యక్షతన సభ జరిగింది.



ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిపిఐ శతవసంతాల వేడుకలలో భాగంగా మహాసభల విజయవంతానికి కళాకారులు తమ వంతు కర్తవ్యం గా భావించి పెద్ద ఎత్తున నూతన కళాకారులను మహాసభలలో భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజా ఉద్యమాలలో పాటే ప్రధాన ఆయుధంగా ఉండాలని దాని ద్వారా ప్రజా చైతన్యం మరింత జరగాలని ఆయన ఆశించారు దేశంలో రాష్ట్రంలో కళాకారులకు తగినంత గుర్తింపు ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా తెలంగాణ తరహా లో సాంస్కృతిక విభాగం ఏర్పాటు చేసి కళాకారులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ తగిన గుర్తింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు సాంస్కృతిక విధానం తీసుకురావడానికి రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కూడా చేపట్ట బోతున్నట్టు ఆయన తెలిపారు కళకళ కోసం కాదు కళ ప్రజల కోసం కళా ప్రజా చైతన్యం కోసం పని చేయాలని అన్నారు. ఈ ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఆఫీస్ బేరర్ వి నాగరాజు నంద్యాల జిల్లా కార్యదర్శి ఎ శివయ్య, వాసు, డప్పు బద్రీ, కోయలకొండ నాగరాజు, విజయ్, మధు శేఖర్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పిడుగు పాటు పై రైతన్నలు అప్రమత్తంగా ఉండాలి.

**-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 21:** వర్షాకాలంలో పిడుగు పై ప్రజల్లో అవగాహణ అవసరం. మనం అప్పుడప్పుడు దిన పత్రికలలో చూస్తూ ఉంటాము పిడుగు పడి కొంత మంది చనిపోయారు అని ఈ మద్య కాలం లో ఎక్కువగా చదువుతున్నాము. కావున ప్రజల్లో ముఖ్యంగా రైతుల్లో పిడుగు పై జాగృత పరచవలసిన భాద్యత సామాజికంగా ప్రతి ఒక్కరి పై ఉన్నదని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. పిడుగు అంటే మేఘంలో ఉన్న విద్యుదావేశం భూమి మీదకు ప్రవహించడం. పిడుగు అంటే ఆకాశములో సహజసిద్ధముగా ఉత్పన్నమయిన విద్యుత్‌పాతము. మేఘాలు ఢీ కొన్నప్పుడు వెలువడే కాంతిని మెరుపు అని, శబ్దాన్ని ఉరుము అని, ఉత్పన్నమయిన విద్యుత్‌ను పిడుగు అని అంటారు. ముఖ్యంగా అకాల వర్షాల వలన మరియు వర్షాకాలంలోను పిడుగు పాటు కు ఆస్తి నష్టం, ప్రాణ నష్టాలు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే వాతావరణ శాఖ వారు ఉరుములు మెరుపులతో పిడుగు పడే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరిస్తున్నారు. కావున వారి సూచనలను పాటించి ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రాణాలను కాపాడుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. పిడుగులు పడే సమయంలో పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలు పిడుగు ఈ ప్రదేశంలోనే పడుతుంది ఇక్కడ పడదు అని ఖచ్చితంగా చెప్పలేము. బాగా మెరుపులు ఉరుములతో కూడిన వర్షం వస్తుంటే బయట ప్రదేశంలో ఉన్నవారు%శా%తమ రెండు చేతులు రెండు మోకాళ్ళ మీద పెట్టుకొని తల క్రిందకు వంచి ఎటువంటి చెట్లు లేని చోట చేతులు భూమికి తగల కుండా అరికాళ్ళ మీద కూర్చోవాలి. ఇలా చేయడం వల్ల ప్రాణాపాయ స్థితి నుండి కాపాడుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. పిడుగులు పడే అవకాశం ఉందని అనిపిస్తే ఇంట్లోని కిటికీలన్నీ మూసివేయాలి. చెట్లకు ,పొడవైన భవంతులకు, ట్రాన్స్ఫార్మర్ లకు దూరంగా ఉండడం మంచిది. ఈ సమయంలో సముద్రం, నది , చెరువులలో ఈత కొట్టటం చేయకూడదు. ఇంట్లో ఉన్నప్పుడు ల్యాండ్ లైన్ వాడకూడదు, ఉరుములు మెరుపుల తో వర్షం కురుస్తున్నప్పుడు సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి.



పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

వర్షం కురుస్తున్న సమయం లో ఎత్తైన చెట్టు క్రింద నిలబడకూడదు ఎందుకంటే ఎత్తైన చెట్లు త్వరగా పిడుగును ఆకర్షిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. పెద్ద వర్షం పడే సూచనలు ఉన్నప్పుడు పక్కనే షెల్టర్ లేకపోతే పైన మూత ఉన్న వాహనము ఏదైన ఒక కారు , బస్సు లాంటి పైన మూసివేసిన వాహనాలు లో కూర్చొంటే మంచిది. ఉరుములతో వర్షం మొదలైన తర్వాత కాలి నడకన , మోటార్ సైకిల్, సైకిల్ ద్వారా ప్రయాణం అంత మంచిది కాదు. గొర్రెల కాపరులు గొర్రెలను వర్షంలో ఏమాత్రం ముందుకు నడపక తగు జాగ్రతలు తీసుకోవాలి. పొలాల్లో తిరిగే రైతులు, రైతుకూలీలు వర్షం, మెరుపులు, ఉరుములు వస్తున్న సమయంలో లోహపు వస్తువులు ఉంచుకోరాదు. ప్రతి ఇంటి ఆవరణలో ఎర్త్ వైర్ ను వేయించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి .మహమ్మద్ రఫి తెలిపారు. ఒక్క సారి గా పిడుగు సంభవించిదంటే దాని నుండి తప్పించుకోవడం అసాద్యం. అయితే ఉరుములు మెరుపులు పిడుగుల గురించి ముందుగానే వాతవరణశాఖ వారు తెలియజేస్తున్నారు. అటువంటి ప్రదేశాలకు వెళ్ళకుండా ఉండటం మంచిది. ఇలాంటి వాటి పై అవగాహణ పెంచాల్సిన భాద్యత ప్రతి ఒక్కరి పై ఉన్నది. పిడుగు పాటుకు గురైతె వెంటనే కృతిమంగా నోటి ద్వారా శ్వాస ను అందించి వెంటనే వైద్యనిపుణుల దగ్గరికి తీసుకెళ్ళి చికిత్స అందించాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# కాంతారావు కుమారుడికి యండమూరి సాయం



ఇటీవలి కాలంలో చాలా మంది సినీ ప్రముఖులు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మనం చూస్తున్నాం. ఎవరైన ఆపదలో ఉన్నారంటే వెంటనే స్పందిస్తున్నారు. తాజాగా దివంగత నటుడు కాంతారావు కుమారుడు రాజేశ్వరరావుకి ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఇటీవల యండమూరికి రఘుపతి వెంకయ్య అవార్డు అందించింది తెలంగాణ ప్రభుత్వం. ఇందులో ఓ లక్ష రూపాయలు తీసి కాంతారావు కుమారుడికి అందజేశారు యండమూరి. అయితే అవార్డ్ అందుకునే సమయంలోనే తాను ఈ బహుమతిలోని కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకి వినియోగిస్తానని చెప్పారు. ఇందులో భాగంగా కడపకు చెందిన ఆర్తి ఫౌండేషన్‌కు రూ.3లక్షలు, శ్రీకాకుళంలో పేద, అనాథ విద్యార్థులకు సాయం చేసే అభయం ఫౌండేషన్‌కి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఇక కాంతారావు కుమారుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఆయన రాజాని తన ఇంటికి పిలిపించుకుని రూ.లక్ష చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కాంతారావు గారి పేరుమీద అవార్డు ఇస్తుందని తెలిసి ఫంక్షన్‌కి రమ్మని వారి కుటుంబానికి వెయ్యి రూపాయలు పంపాను. అయితే కాంతారావు గారి కుమారుడు ఇంటి అద్దె కూడా కట్టలేని పరిస్థితిలో ఉన్నాడని తెలిసి చాలా బాధపడ్డాను. అందుకే అవార్డ్ అందుకున్న వెంటనే ఇంటికి పిలిచి లక్ష అందించాను అని తెలిపారు. సినిమాల్లో శత్రువులపై కత్తి దూసి తన అద్భుత విన్యాసాలతో ప్రేక్షకులని ఎంతగానో అలరించేవారు కాంతారావు. వెండితెరపై ఓ వెలుగు వెలిగిన ఆయన చివరి దశలో అంతా పోగొట్టుకున్నారు. ఇక కాంతారావు చనిపోయాక కుటుంబ పరిస్థితి దారుణంగా మారింది. గద్దర్ సినీ అవార్డుల సందర్భంగా టీఎస్ కాంతారావు పేరుతో అవార్డును హీరో విజయ్ దేవరకొండకి అందజేసిన విషయం తెలిసిందే.




# నా బాడీ నా ఇష్టం

## : శృతిహాసన్

కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ ఎంత స్ట్రైట్ ఫార్వార్డ్ అనేది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తనకు సంబంధించిన ఏ విషయం అయిన నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. మల్టీ టాలెంటెడ్ అయిన శృతి హాసన్ టీనేజ్‌లో ఉన్నప్పుడే సింగర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టింది. ఆ తర్వాత స్వయంగా ఎన్నో ఆల్బమ్‌లను కూడా రూపొందించింది. ఈ క్రమంలోనే 'హే రామ్' అనే చిత్రంలో చిన్న పాత్రతో నటిగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ లక్ అనే హిందీ చిత్రంలో నిపించింది. ఇక, తెలుగులో వచ్చిన 'అనగనగా ఓ ధీరుడు'తో శృతి హీరోయిన్‌గా జర్నీని స్టార్ట్ చేసింది. అయితే పవన్ కళ్యాణ్ సరసన నటించిన గబ్బర్ సింగ్ చిత్రం శృతి హాసన్ ఫేట్‌ని మార్చేసింది అని చెప్పాలి. కుర్ర హీరోలతోనే కాకుండా సీనియర్ హీరోలతో కూడా శృతి హాసన్ సినిమాలు చేస్తుంది. ఆ మధ్య ప్రభాస్‌తో 'సలార్', బాలకృష్ణతో 'వీరసింహారెడ్డి', చిరంజీవితో 'వాల్తేరు వీరయ్య' మూవీలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టింది. త్వరలో సలార్2తో సందడి చేయనుంది. అయితే కెరీర్ పరంగా శృతికి పెద్ద సమస్యలేమి లేవు కాని పర్సనల్ లైఫ్‌లోనే డిస్టబెన్స్ ఎక్కువ అవుతుంది. అప్పట్లో విదేశీ గాయకుడు మైకేల్ కోర్సలేతో డేటింగ్ చేసిన ఈ అమ్మడు అతడిని కమల్ హాసన్‌కు పరిచయం కూడా చేసింది. దాంతో శృతి హాసన్, మైకేల్ కోర్సలే పెళ్లి చేసుకుంటారని అంతా అనుకోగా, కొద్ది రోజులకే వీళ్లు బ్రేకప్ చెప్పుకున్నారు. మైకేల్‌తో విడిపోయిన తర్వాత శృతి హాసన్.. డూడుల్ ఆర్టిస్టు అయిన శాంతను హజారికాతో ప్రేమాయణం కొనసాగించింది. అతడితో ఎంజాయ్ చేసిన ఫొటోలు అన్ని కూడా సోషల్ మీడియాలో షేర్ చేసేది. అతడితో రొమాంటిక్‌గా గడిపింది. కాని ఎందుకో ఏమో శాంతనుకు శృతి హాసన్ బ్రేకప్ చెప్పేసింది. అయితే తాజాగా శృతి హాసన్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర కామెంట్స్ చేసింది. టీనేజ్ లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చకపోవడంతో 'సర్జరీ' చేయించుకున్నాను అని తెలిపింది. ఇక ముఖం మరింత అందంగా కనిపించేందుకు పిల్లర్స్ కూడా వాడాను. కొంత మంది వీటిని బయటకి చెప్పుకోవడానికి ఇష్టపడరు. కానీ నేను అలా కాదు నా నాబాడీ నా ఇష్టమన్నారు శృతిహాసన్.



# వరుస సినిమాలతో ప్రియాంక మోహన్ బిజీ

ప్రియాంక మోహన్.. స్టార్ హీరోలతో వరుసగా సినిమాలు చేస్తోంది ఈ అమ్మడు. పేరుకు మలయాళ నటినే అయినా పక్కింటమ్మాయిలా కనిపిస్తూ తెలుగు ఆడియెన్స్ కు బాగా చేరవవుతోంది. తన అందం, అభినయంతో టాలీవుడ్ లో క్రమంగా స్టార్ హీరోయిన్ గా ఎదుగుతోంది. కెరీర్ ప్రారంభంలోనే నాని, శర్వానంద్ లాంటి ప్రామిసింగ్ హీరోలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఈ అందాల తార ఇప్పుడు ఏకంగా పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది. స్టైలిష్ డైరెక్టర్ సుజిత్ తెరకెక్కిస్తోన్నతెరకెక్కిస్తోన్న ఓజీలో ఈ బ్యూటీనే మెయిన్ హీరోయిన్ గా ఎంపికైంది ప్రియాంక మోహన్. చివరిగా సరిపోదా శనివారంతో బ్లాక్ బస్టర్ మూవీని ఖాతాలో వేసుకుంది ప్రియాంక అరుళ్ మోహన్. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉండే ఆమె రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మొన్నటివరకు గ్లామర్ డోస్ కు దూరంగా ఉండే ఈ అమ్మడు ఇప్పుడు తన బ్యూటీ ఫుల్ ఫొటోలతో అభిమానులను మెప్పిస్తుంది. 2019లో కన్నడ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ప్రియాంక మోహన్. అదే సంవత్సరం న్యాచురల్ స్టార్ నాని 'గ్యాంగ్ లీడర్' సినిమాతో తెలుగు సినిమాకు పరిచయమైంది అందాల తార. ఆతర్వాత శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించింది. ఆతర్వాత టాలీవుడ్ లో గ్యాప్ ఇచ్చింది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు అభిమానులను కవ్విస్తున్నాయి. చీరకట్టులో అందాలు ఒలకబోస్తూ క్రేజీ ఫోటోలను పంచుకుంది. ఈ ఫోటోల పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అమ్మడి అందాలను పొగుడుతూ కామెంట్స్ చేస్తున్నారు.

# డ్రగ్స్‌పై మలయాళ ఇండస్ట్రీ కీలక నిర్ణయం

మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై చిత్ర నిర్మాణంలో పాలుపంచుకునే ప్రతి ఒక్కరూ, డ్రైవర్ల నుండి సూపర్ స్టార్స్ వరకు, షూటింగ్ సమయంలో మాదకద్రవ్యాలను ఉపయోగించబోమని హామీ ఇస్తూ అఫిడవిట్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. ఈ కొత్త నిబంధన జూన్ 26 నుండి అమలులోకి రాబోతుంది. ఇదే రోజున మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకోబోతున్నారు ఇటీవల చిత్ర పరిశ్రమలో చోటుచేసుకున్న డ్రగ్స్ సంబంధిత అరెస్టులు, పలువురు నటులు, సిబ్బంది సభ్యులు పట్టుబడటంతో ఈ కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ వెల్లడించింది. షూటింగ్ సెట్లు, లొకేషన్లు మరియు పోస్ట్-ప్రొడక్షన్ కార్యకలాపాల్లో డ్రగ్స్ లేని వాతావరణాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని అసోసియేషన్ పేర్కొంది. ఈ నిర్ణయంపై ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ మలయాళ చిత్ర పరిశ్రమలోని అన్ని విభాగాలతో విస్తృతంగా చర్చలు జరిపింది. డ్రగ్స్ లేని పరిశ్రమను కోరుకుంటూ అందరూ ఈ చర్యకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్ కూడా ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది.

# పెళ్లి తర్వాత లావణ్య మొదటి సినిమా



మెగా కోడలు లావణ్య త్రిపాఠి పెళ్లి తర్వాత కొన్ని రోజులు సినిమాలకు బ్రేక్‌నిచ్చిన విషయం తెలిసిందే. 2023లో వరుణ్ తేజ్‌తో కలిసి వివాహ బంధంలో అడుగుపెట్టిన లావణ్య సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అయితే పెళ్లి తర్వాత మెగా కోడలిగా రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపింది. లావణ్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం సతీ లీలావతి(). భీమిలీ కబడ్డీ జట్టు సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తాతినేని సత్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాలపై నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో లావణ్య కోపంతో అరుస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే మూవీ భార్య భర్తలమధ్య ఉన్న అనుబంధం ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీకి మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్‌గా బినేంద్ర మీనన్, ఎడిటింగ్ బాధ్యతలను సతీష్ సూర్య చేపడుతున్నారు. మరోవైపు లావణ్య- వరుణ్ దంపతులు త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నట్లు ఇటీవల ప్రకటించారు.

# 'హరిహర వీరమల్లు' కొత్త రిలీజ్ డేట్..

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'హరిహర వీరమల్లు' పార్ట్ 1 విడుదల తేదీపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఈ సినిమాను జులై 24వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా అధికారికంగా ప్రకటించింది. దీంతో అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికినట్లయింది. వాస్తవానికి ఈ చిత్రం ఈనెల 12న విడుదల కావాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. 'హరిహర వీరమల్లు: పార్ట్ 1- స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో రానున్న ఈ సినిమాలో పవన్ కల్యాణ్ మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. సినిమా ప్రారంభమైనప్పటి నుంచి పలుమార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చింది. పవన్ రాజకీయాల్లో బిజీ కావడం, తదితర కారణాల వల్ల సినిమా చిత్రీకరణ ఆలస్యమైంది. మొదట క్రిష్ దర్శకత్వంలో కొంత భాగం చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా బాధ్యతలను ఆ తర్వాత నిర్మాత ఏఎం రత్నం కుమారుడు జ్యోతికృష్ణ చేపట్టారు.




సినిమా చిత్రీకరణ ఆలస్యం కావడం, సెట్స్ పై ఎక్కువ కాలం ఉండటంతో నిర్మాతపై ఆర్థిక భారం పడిందని భావించిన పవన్, తాను అడ్వాన్స్ గా తీసుకున్న పారితోషికాన్ని పూర్తిగా వెనక్కి ఇచ్చేసినట్లు సమాచారం. అంతేకాకుండా, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా సినిమా కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రాత్రి 10 గంటలకు డబ్బింగ్ పనులు మొదలుపెట్టి, ఏకధాటిగా నాలుగు గంటల్లో పూర్తి చేశారని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలోని 'అసుర హననం' పాటలో వచ్చే పోరాట సన్నివేశాలను పవన్ కల్యాణే స్వయంగా డిజైన్ చేశారని దర్శకుడు జ్యోతికృష్ణ గతంలో ఒక సందర్భంలో వెల్లడించారు. ఈ పాత్ర కోసం పవన్ మార్షల్ ఆర్ట్స్ లో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నారు. ఈ పీరియాడికల్ యాక్షన్ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎంఎం కీరవాణి బాణీలు అందిస్తున్నారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా మొదటి భాగం విడుదలకు సిద్ధమవడంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.